క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15, 16వ తేదీల్లో కళాశాల కార్యాలయంలో సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్సులు సమర్పించి రశీదు పొందాలని, 17న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

బౌద్ధక్షేత్రం సందర్శన

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రాన్ని మంగళవారం ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కాలేజీ విద్యార్థులు, ఆధ్యాపకులు సందర్శించారు. బుద్ధుడు నడియాడిన నేలను సందర్శించటం చాలా సంతోషంగా ఉందని పేర్కొంటూ.. బౌద్ధక్షేత్రం చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీరుల్లా, ఆధ్యాపకులు మిల్లన్, జి.వెంకయ్య, రవీంద్రారెడ్డి, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనురాధ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సంతకం చేస్తున్న సీఐ సత్యనారాయణ

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ సీఐగా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న సర్వయ్య బదిలీ కాగా ఆయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెంలో సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై వచ్చారు. గతంలో పాల్వంచ, కొత్తగూడెంలో సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా బదిలీ అయిన సీఐ సర్వయ్యకు ఘనంగా సిబ్బంది వీడ్కోలు పలికారు.

ఢిల్లీ ఆందోళనలో 'తుంపాల'


ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: చలో పార్లమెంట్‌లో భాగంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్‌టీపీ వైఎస్ షర్మిల ఆధ్వర్యాన నిర్వహించిన నిరసనలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల ఆర్డర్ల అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మంగళవారం కారుణ్య నియామకాల్లో భాగంగా నలుగురికి ఉద్యోగ నియామక ఆర్డర్లను మేయర్ పునుకొల్లు నీరజ అందజేశారు. అనంతరం వారిని అభినందించారు. కంచెపోగు గోవిందు, కసాల సాగర్, గుర్రాల మధు, కొల్లి అరుణలు పత్రాలు అందుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, చంద్ర హాసిని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 9,14వ డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులను మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ జానీబీ, నాగుల్ మీరా, ప్రసాద్, ఆకుల వెంకటేశ్వర్లు, సురేష్, డీఈ రంగారావు, ఏఈ కుమార్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేషనగర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శుభశ్రీ, బాలు ప్రారంభించారు. ఈ శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు రవికుమార్, హుస్సేన్, మామిడి వెంకన్న, లక్ష్మీనారాయణ, ఎం.రామకృష్ణ, జి.గోపాల్‌రావు, అభిలాష్, హరినాధ్‌నాయక్, మనాకర్‌రెడ్డి, తిప్పిరెడ్డి పవన్‌రెడ్డి, సింగిరెడ్డి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	తూ జూటీ మై మక్కర్, ఈఎస్‌ఐ సనాతన్
ఆదిత్య	ఆర్‌ఆర్‌ఆర్
శ్రీనివాస	65
సుందర్	సింహా

- ఖమ్మంవ్యవసాయం

లక్ష్యానికి మించి!



నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం (ఇన్‌సెట్) ప్రధాన ద్వారం



ఈ ఏడు వ్యవసాయ మార్కెట్ లక్ష్యం రూ.5.19 కోట్లు

- ఇప్పటికే రూ.5.22 కోట్ల పైగా ఆదాయం
- గత ఐదేళ్ల తర్వాత టార్గెట్ పూర్తి..
- మెరుగ్గా సిబ్బంది పనితీరు

జిల్లాలోనే నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదర్శంగా నిలుస్తోంది. మార్కెట్ ఫీజు రూపంలో లక్ష్యాన్ని దాటేసింది. ఇంకా గడువు ఉన్నప్పటికీ ఆదాయాన్ని మరింత పెంచేందుకు సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తోంది. గత ఐదేళ్ల తర్వాత టార్గెట్‌ను దాటి లక్ష్యాన్ని చేరుకోవటమే కాకుండా ఆదర్శంగా నిలిచింది.

నేలకొండపల్లి: నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాల పరిధిలో ఉంది. మార్కెట్ యార్డులో ధాన్యం, కందులు, మొక్కజొన్నతో పాటు గతంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుతో మార్కెట్‌కు ఆదాయం సమకూరుతుంది. కాగా, 2022–23కు సంబంధించిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.5.19 కోట్ల లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉండగా.. మార్చి 10వ తేదీ నాటికే రూ.5.22 కోట్ల ఆదాయం సమకూర్చింది. ఇంకా 20 రోజులు గడువు ఉండడంతో ఇంకా మరింత ఆదాయం పెరగనుంది. ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో రూ.3.19 కోట్లు, మార్కెట్ ఫీజు రూ.2 కోట్లను టార్గెట్ విధించింది. మొత్తం మీద టార్గెట్‌ను రీచ్ కావటంతో పాలకవర్గం సంతోషం వ్యక్తం చేస్తోంది.

చెక్ పోస్టుల్లో పైనంపల్లి టాప్..

మార్కెట్ కమిటీ పరిధిలో నేలకొండపల్లి మండలంలో పైనంపల్లి, ముదిగొండ మండలంలోని వల్లభి, ముదిగొండ, కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మార్కెట్‌కు ఫీజుల రూపంలో ఆదాయం సమకూరుతోంది. ఈ ఏడాది పైనంపల్లి చెక్‌పోస్టు రూ.80 లక్షలను వసూలు చేసి ఆదర్శంగా నిలిచింది. చెక్ పోస్టులో పని చేసే సెక్యూరిటీ గార్డులు మారగాని వీరబాబు, కాంతరావు, సన్నాయిల వీరభద్రం, సాయిలను కమిటీ ప్రత్యేకంగా అభినందించింది.

రెగ్యూలర్ సిబ్బంది లేకున్నా..

ఇంత ఆదాయాన్ని సమకూర్చి.. ఆదర్శంగా నిలుస్తున్నా మార్కెట్‌కు రెగ్యూలర్ సిబ్బంది ఉండరు. అంతా ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే నడిపిస్తున్నారు. మార్కెట్‌లో 11 మంది సిబ్బంది కాగా వారిలో 10 సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మేన్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. వీరికి అరకొర వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత లేదు. అయినప్పటికీ ప్రభుత్వం లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. పలుమార్లు తమ గోడు వినిపించుకోవాలని వేడుకున్నా.. ఇటు పాలకులు కానీ అటు అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరి కృషితోనే..



మార్కెట్ కమిటీ ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించటం అందరి కృషి వల్లే సాధ్యమైంది. సెక్యూరిటీ గార్డులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది సహకారంతో టార్గెట్‌ను పూర్తి చేశాం. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. మార్కెట్ పాలకవర్గ సూచనలు, సలహాల మేరకు ముందుకు సాగుతున్నాం.

– శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, నేలకొండపల్లి

సమస్యలు పరిష్కరించాలి..



సెక్యూరిటీ గార్డులకు వేతనాలు తక్కువ. ఉద్యోగ భద్రత లేకున్నా.. ఇచ్చిన టార్గెట్‌ను సాధించేందుకు కష్టపడుతున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలను రద్దు చేసి నేరుగా కమిటీ ద్వారా కనీసం రూ.35 వేల వేతనాలు అందిస్తే ఇంకా మెరుగ్గా పనిచేసే అవకాశం ఉంటుంది.

– మారగాని వీరబాబు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు

రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలి..



స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి మంచి ఆదాయం వస్తున్నందున్న రైతులకు 50 శాతం రాయితీపై టార్పాలిన్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే విధంగా రైతు విశ్రాంతి భవన్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. రైతుల ప్రయోజనాల కోసం కమిటీ పాటుపడాలి.

– కాశిబోయిన అయోధ్య, రైతు, సింగారెడ్డిపాలెం

ఆరోగ్య వంతమైన సమాజమే లక్ష్యం


నేలకొండపల్లి: రాజేశ్వరపురంలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి : ఆరోగ్య వంతమైన సమాజమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ గాంధీనగర్ గ్రంథాయంలో మేయర్, నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లి, రాజేశ్వరపురంలో ధనలక్ష్మి కంటి వెలుగు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ కంటి చూపు కలగాలనే లక్ష్యంతో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, స్థానిక కార్పొరేటర్ తోట ఉమారాణి వీరభద్రం, నున్న సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు గుండెపునేని కమలాకర్, శివాలయం చైర్మన్ గుండు లక్ష్మీనారాయణ, డాక్టర్లు చిన్ని, గౌతమ్, బాబు, తదితరులు పాల్గొనగా.. నేలకొండపల్లి కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై జి.స్రవంతి, సర్పంచ్‌లు దండా పుల్లయ్య, గురవమ్మ, వైద్యాధికారులు, పీహెచ్‌ఎన్‌లు దుర్గ, కె.వాణి, రాజేశ్వరపురంతో పాటు అంగిరేకుల గోపి, ఎర్రబోయిన నర్సయ్య, వి.రాజా తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్కెట్ కమిటీకి సన్మానం


నూతన కమిటీని సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మధురానగర్‌లోని సాయిమందిరంలో మంగళవారం ఖమ్మం నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రత్యేక పూజలు చేశారు. మందిరం అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆధ్వర్యాన మందిరంలో పూజలు చేసిన అనంతరం ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, మందిర, కాలనీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ కూరాకుల వలరాజు, మందిర కమిటీ ఉపాధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాసరావు, ఆర్టీఏ సభ్యుడు వల్లభనేని రామారావు, వైస్ చైర్మన్ అఫ్జల్, పొట్టపల్లి రాజా, కుతుంబాక నరేష్, నున్నా శ్రీనివాసరావు, సూర్య, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవ వేడుకలు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని శ్రీశ్రీశ్రీభువనేశ్వరీమాత, శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణదేవతాసహిత, శ్రీశ్రీశ్రీసమర్థ సద్గురు సాయినాథ దేవాలయం నాల్గో వార్షికోత్సవ వేడుకలు నేటి నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు మందిర కమిటీ వారు తెలిపారు.బుధవారం గణపతిపూజా, అఖండ దీప స్థాపన, అంకురారోపణ తదితర పూజా కార్యక్రమాలు, గురువారం లక్ష్మీగణపతి, దత్తాత్రేయ రాధాకృష్ణ సాయినాథ రుద్రహోమములు, చండీయాగం, శుక్రవారం సాయినాథునికి మహా పుష్పాభిషేకం, సామూహిక కుంకుమపూజలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఉపాధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాసరావులు కోరారు.

పేపర్ లీకేజీల బాధ్యత ప్రభుత్వానిదే..



ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపి, కారకులను కఠినంగా శిక్షించాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1, టీపీఓ పేపర్ లీకేజీ ఘటనలను నిరసిస్తూ మంగళవారం విద్యార్థులతో గ్రంథాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ద్వారా విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం గత మూడేళ్లుగా అభ్యర్థులు అహర్నిశలు కష్టపడి ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతుంటే పేపర్ లీకేజీ ఘటనలు చోటు చేసుకోవడం చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, విద్యార్థి, నిరుద్యోగుల జీవితాలకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సతీష్, సాయి, రత్నాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహంలో ఉండి విద్యనభ్యసిస్తున్న ఇంటర్ విద్యార్థులకు వసతిగృహం సంక్షేమాధికారి యు.భారతీదేవి సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఖమ్మం ముస్తాఫనగర్‌లో కొనసాగుతున్న కొణిజర్ల కళాశాల బాలుర విద్యార్థులకు ఆమె అవసరమైన వస్తువులు అందజేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలు రాయాలని సూచించారు. వసతిగృహం సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్‌లోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న మొత్తం 179 మంది విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య మంగళవారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. ఈ ట్రస్టు ద్వారా బాలిక విద్యకు తొలి ప్రాధాన్యత నిస్తుందన్నారు. కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు సరితకుమారి, శ్రీలక్ష్మి, స్వరూపరాణి, రమాదేవి, మౌనిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కూసుమంచి: ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 24న సీపీఎం ఆధ్వర్యాన మండల కేంద్రంలో నిర్వహించే జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, మాజీ జెడ్పీటీసీ ఎర్రబోయిన భారతి, పార్టీ మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, నాయకులు మల్లెల సన్మంతరావు, గంగాధర్,రాజు, వెంకటేశ్వరరావు, గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఫ్యామిలీ గ్లోరి


ఫ్యామిలీ గ్లోరి నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మమత రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్‌నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం ఫ్యామిలీ గ్లోరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు.అంతరించిపోతున్న కుటుంబ వ్యవస్థ, మానవ విలువలు కాపాడేందుకు చిన్నప్పటినుంచే పిల్లలు వినయం, విధేయతను అలవర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహించినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శర్మ, నాగప్రవీణ, పాఠశాల డీజీఎం చేతన్, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సురేష్, డీన్స్ కేవీఆర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

నేలకొండపల్లి: క్షయపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయగూడెం, కట్టుకాసారాం, చెరువుమాధారం గ్రామాల్లో మంగళవారం క్షయపై అవగాహన సదస్సును నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా హెల్త్ మేళా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ వీరన్న, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని జూపెడలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు దోనెపల్లి వెంకన్న ప్రథమ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. తొలుత వెంకన్న స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, జిల్లా నాయకుడు బండి రమేష్, నాయకులు నర్సయ్య, విజయ్, నాగమణి, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అయోధ్య, గురవయ్య, రమేష్ పాల్గొన్నారు.

'రెజొనెన్స్ శ్రీనగర్'లో వీడ్కోలు వేడుక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో కృషి చేస్తే వాటిని సాధించడం సులువవుతుందని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ తెలిపారు. నగరంలోని శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఇష్టపడి చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తర్ఫీదు నిచ్చామని తెలిపారు. అనంతరం 9, 10వ తరగతుల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నరావుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో తీరిన తాగునీటి సమస్య

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ హైస్కూల్‌కు చెందిన పూర్వవిద్యార్థులు (1997–98 బ్యాచ్) పాఠశాలలో తాగునీటి బోరు వేయించారు. పాఠశాలకు ప్రత్యేక బోరు లేకపోవడంతో 250 మందికి పైగా విద్యార్థులు మిషన్ భగీరథ నీటి నల్లాపైనే ఆధారపడాల్సి వస్తుంది. దీంతో సమస్యను తెలుసుకున్న పూర్వ విద్యార్థులు బోరు వేయించగా.. మంగళవారం మోటారు బిగించి పాఠశాల హెచ్‌ఎం శైలజలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరిప్రసాద్, కుమారి, నాగయ్య, మాధవి, లత, స్నేహలత, పద్మ, కిస్టఫర్, బాబురావు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బోరును ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శైలజలక్ష్మి

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని మండలాల్లో మంగళవారం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు అమలు చేయగా.. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షకు నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోని అనుమతి లేదని అధికారులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


నేలకొండపల్లి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరిశీలిస్తున్న ఎస్సై స్రవంతి, తదితరులు


కూసుమంచి ఉన్నత పాఠశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్


జల్లెపల్లిలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని జల్లెపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన హథ్ సే హథ్ జోడో యాత్రలో భాగంగా ప్రజలను కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి లాంటి హామీలను విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకే దఫా రూ.2లక్షల రుణమాఫీ, మూడెకరాల భూమి, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్, ఇజ్రాయిల్, సంకీర్త్‌రెడ్డి, నాగరాజు, మోహన్ రమేష్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రఘునాథపాలెం: నెలనెలా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులతో పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం రఘునాథపాలెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యాన భిక్షాటన చేసి తమ గోడును వెల్లబుచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు జీతాలు రాక కుటుంబ పోషణ భారమై పస్తులుంటూ.. పని ఎట్లా చేస్తారని విమర్శించారు. గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, ట్రాక్టర్ నడిపే కార్మికులకు ప్రభుత్వమే లైసెన్సులు ఇప్పించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం నిర్వధిక సమ్మె బాట పడతామని అందుకు మండల వ్యాప్తంగా సిబ్బంది సమాయత్తం అవుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుగులోతు రాందాస్, ఎం.రాజగోపాల్, బాణోతు మంగీలాల్, పెనుగూరి సీతారాములు, అర్వపల్లి శ్రీను, వెంకన్న, జి.విజయ్, ఉపేందర్, రామకష్ణ, జేల్యా, కోటేశ్వరరావు, రాజు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి..

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పేషెంట్ కేర్, గార్డెన్ సెక్షన్, సెక్యూరిటీ గార్డులు, కార్మికులు నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నా.. గత మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వని సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకొని జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు అంబేద్కర్, క్రాంతి, కళ్యాణ్, దుర్గ భవాని, శ్రీను, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.